# లభించని ప్రోత్సాహం

**-సి.హెచ్. వి. బృందావనరావు**

"**నే**ను సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ప్రయత్నిద్దామను కొంటున్నాను" అన్నది వినూత్న ప్రభాత్‌తో.

"నువ్వా, సివిల్ సర్వీసెస్‌కా. అదేం అంత ఈజీ అనుకుంటున్నావా" అన్నాడు ప్రభాత్.

"ప్రయత్నం చేస్తే ఏదీ అసాధ్యం కాదు" అన్నది వినూత్న.

"చూద్దాం" అన్నాడు ప్రభాత్.

వినూత్నా, ప్రభాత్ యూనివర్సిటీలో ఎం.ఏ. చేస్తున్నారు. ఇద్దరిదీ ఒకే సబ్జెక్టు. కాలేజీలో చదివే టప్పుడు కూడ ఇద్దరూ క్లాస్‌మేట్స్. కలిసే చదివారు. బి.ఏ. పూర్తి కాగానే ఎం.ఏ. కూడా యూనివర్సిటీలో కలిసే చదువుతున్నారు.

ప్రభాత్ బాగా తెలివైన విద్యార్థి. చాలా త్వరగా ఏ విషయమైనా అవగాహన చేసుకుంటాడు. సైన్సు, లెక్కలకన్నా అతనికి ఆర్ట్స్ విషయాల మీదే అభిరుచి ఎక్కువ. అందుకనే ఎంసెట్ లాంటి వాటిమీదికి దృష్టి పోనీలేదు. అతని దృష్టి ఎప్పుడూ బోధించడం మీదే వుండేది. లెక్చరర్‌గా చేరి విద్యార్థులకు బోధించాలనే అభిలాష ఎక్కువ అతనికి. కానీ ఏ విషయంలోనూ పరిశ్రమ తక్కువ. ఏదైనా ఓ సమస్య వస్తే దానిని సాధించి పరిష్కరించుకుందామనే పట్టుదలా తక్కువే. అయితే అతని తెలివితేటలకూ, ఏకసంధాగ్రాహితకూ, మంచి ఫలితాలే వస్తాయి. ప్రతి పరీక్షలోనూ మంచి మార్కులే తెచ్చుకుంటాడు.

"నువ్వు కూడా సివిల్స్‌కు ప్రయత్నించరాదా" అంది వినూత్న.

"నేనా, అంత శ్రమపడటం మనవల్ల కాదు" అన్నాడు.

వినూత్నా, ప్రభాత్‌లు కేవలం క్లాస్‌మేట్స్ కాదు, ఒకరంటే ఒకరికి ఇష్టం కూడా.

ప్రభాత్‌ది కడప జిల్లాలోని ఓ పల్లెటూరు. అతని తండ్రి మోతుబరి రైతు. బాగా వున్న కుటుంబం. చదువు పూర్తికాగానే ఓ లెక్చరర్ ఉద్యోగం సంపాదించుకొని జీవితంలో స్థిరపడాలని అతని ఉద్దేశం. వినూత్నను గత మూడేళ్ళుగా గమనిస్తూనే వున్నాడు. ఆమె తెలివితేటలు అతనికి బాగా నచ్చాయి. వినూత్నకు కూడా తనంటే ఇష్టమేనని అర్థం చేసుకున్నాడు.

తనే ఒకరోజు ఆమెను కదిపాడు. "వినూత్నా, మనం పెళ్లి చేసుకుందాం" అన్నాడు ఓరోజు సాయంకాలం. లైబ్రరీ నుంచి బయటికి వచ్చి కేంపస్‌లో ఓ చెట్టు కింద బెంచీ మీద కూర్చుని వున్నారు ఇద్దరూ.

సిగ్గుపడింది వినూత్న. వినూత్నకూ అతనంటే ఇష్టమే. అతనూ తనను ఇష్టపడుతున్నాడనీ, ఏదో ఓరోజు ఈ ప్రస్తావన తెస్తాడనీ అనుకుంటూనే వున్నది.

"ఎంత పెద్ద చదువు చదివినా, ఎంత కో- ఎడ్యు కేషన్ అయినా - పెళ్లి అనేసరికి సిగ్గు ముంచుకొస్తుంది మీ ఆడవాళ్లకు" అన్నాడు ప్రభాత్.

"ఆడమనసు ఆడమనసే కదా" అంది వినూత్న.

వినూత్నది ప్రకాశం జిల్లాలో ఓ పల్లెటూరు. ఆమె తండ్రి ఓ హైస్కూలు టీచరు. అక్కా ఓ తమ్ముడూ, ఓ చెల్లెలూ ఆమెకు. కుటుంబానికి ఆధారం ఆమె తండ్రి జీతమే. అక్కకు పెళ్లయింది. తమ్ముడు బి.టెక్. చదువుతున్నాడు. చెల్లెలు ఇంటర్మీడియెట్.

"జవాబు చెప్పనేలేదు నువ్వు" అన్నాడు ప్రభాత్.

"ఇప్పటికిప్పుడు చెప్పి తీరాల్సిందేనా. ముందు మన కెరీర్లు స్థిరపడనిద్దాం" అంది వినూత్న.

తనను పెళ్లి చేసుకోవడానికి ఆమెకు అభ్యంతరం ఏమీ లేదని అర్థం చేసుకున్నాడు ప్రభాత్.

"మన కెరీర్లకు ఇప్పుడు ఇబ్బందేమొచ్చింది. పరీక్ష ఫస్ట్ క్లాసులో పాసవుతాను. ఇంటర్వ్యూ బాగా చెయ్య గలను. మా నాన్న రాజకీయంగా పలుకుబడీ ఉపయో గించగలడు. ఒక లెక్చరర్ పోస్టు సంపాదించలేనా? మనం సుఖంగా ఉండడానికి అది చాలదా" అన్నాడు.

"నువ్వు నీ కెరీర్ సంగతే మాట్లాడుతున్నావు. నా కెరీరు సంగతేమిటి" అంది వినూత్న.

"ఏం. ఇంటి ఇల్లాలు అనేది మంచి కెరీర్ కాదా" అన్నాడు ప్రభాత్.

"లేదు ప్రభాత్. ఇంత చదువు చదుకునేది దేనికోసం. నాకో ఉద్యోగం, అదీ మంచి ఉద్యోగం చెయ్యాలని వుంది. అందుకే సివిల్స్‌కు ప్రయత్నిస్తున్నాను. దరఖాస్తూ పంపాను" అన్నది వినూత్న.

"అదంత సులభం కాదు వినూత్నా. లేనిపోని దురాశను పెంచుకోకు" అన్నాడు ప్రభాత్.

"ఇందులో దురాశ ఏముంది? నాకు అర్హత లున్నాయి. దరఖాస్తు పెట్టాను. పరీక్షల కోసం రాత్రిం బవళ్లు శ్రమపడుతున్నాను. సాధించి తీరతాను" అంది వినూత్న.

ప్రిలిమ్స్ పరీక్షలు అయిపోయాయి. ఎం.ఏ. మొదటి సంవత్సరం కూడ అయిపోయింది. వినూత్నా, ప్రభాత్‌లు మంచి మార్కులు సాధించారు.

వినూత్నకు ప్రిలిమినరీస్‌లోనే చుక్కెదురైంది. ఆమె బాగా క్రుంగిపోయింది.

"నేను చెప్పానుగదా వినూత్నా. ఎందుకు అనవస రంగా శ్రమపడతావు. ఇది నీ చేతగాదు వదిలెయ్" అన్నాడు ప్రభాత్. అతని మాటలతో బాగా నీరసం వచ్చింది. తన ప్రయత్నాలు అపుదామా అనిపించింది. కానీ కొన్ని రోజులు గడవగానే పట్టుదల రెట్టింపైంది. ఇంకా తీవ్రంగా చదవడం మొదలుపెట్టింది. ఎక్కువ సమయం యూనివర్సిటీ లైబ్రరీలోనే గడుపుతున్నది. తన ఎం.ఏ. చదువును కూడా ఏమీ అశ్రద్ధ చేయలేదు. మళ్లీ సివిల్ ప్రకటన రాగానే దరఖాస్తు పంపింది. ఈసారి ప్రిలిమినరీస్‌లో సెలెక్టయింది. మెయిన్ పరీక్ష కూడా బాగానే రాసింది. ఫలితాల కోసం ఎదురు చూస్తున్నది. ఎం.ఏ. రెండో సంవత్సరం పరీక్షలు దగ్గర పడు తున్నాయి. ఈలోగా మెయిన్స్ ఫలితాలు కూడా వచ్చాయి. వినూత్న మంచి మార్కులతోనే దానిలోనూ నెగ్గింది.

"కంగ్రాట్స్" అన్నాడు ప్రభాత్.

"ఇంకా ఇంటర్వ్యూలు ఉన్నాయి కదా" అంది వినూత్న.

ఎం.ఏ. రెండో సంవత్సరం పరీక్షలైపోయాయి. ఎవరి ఊళ్లకు వాళ్లు బయలుదేరే ముందు ఇద్దరూ కలిశారు.

"ఇంక ఉద్యోగాల వేట మొదలుపెట్టాలి. మా నాన్న పలుకుబడి ఏమైనా ఉపయోగిస్తుందేమో చూడాలి" అన్నాడు ప్రభాత్.

"మీ నాన్న పలుకుబడి కావలసిందేనా. నీవు నీ సొంత ప్రతిభతో సంపాదించుకోలేవా" అంది వినూత్న.

"ఎందుకు సంపాదించుకోలేము. ఎం.ఏ.లో తప్ప కుండా ఫస్ట్ క్లాస్ వస్తుంది. ఇంటర్వ్యూలో దంచెయ్య గలను. అయినా కొంచెం రాజకీయ ఒత్తిడి ఉండడమూ మంచిదేగదా" అన్నాడు ప్రభాత్.

వాళ్ల నాన్న ద్వారా ఉద్యోగ ప్రయత్నం సాగిస్తున్నాడు ప్రభాత్. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూను ఎదుర్కోవడానికి సన్నద్ధమవుతున్నది వినూత్న.

ఇద్దరూ ఎం.ఏ.లో ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారు. ప్రభాత్ ఉద్యోగ ప్రయత్నాలింకా ఒక కొలిక్కి రాలేదు.

వినూత్న సివిల్ సర్వీసుల ఇంటర్వ్యూలో ఎంపిక కాలేదు. బాగా ఆశాభంగం పొందింది. క్రుంగిపోయింది. ఓ పది రోజుల తరువాత మళ్లీ ఆఖరు ఛాన్సుగా పరీక్షలకు తయారు కావడానికి పూనుకుంది.

"ఏదైనా ఉద్యోగం కోసం ప్రయత్నించరాదా అమ్మా" అన్నాడు వినూత్న తండ్రి.

"ఈసారి ఇంకా బాగా కష్టపడతాను. ఈ ఫైనల్ ఛాన్సును ప్రయత్నించనీ నాన్నా" అంది వినూత్న.

## మార్గగామి

**గు**డ్డివాడు
నునువుదనం కోసం
గడ్డం గీసుకుంటున్నాడు
అందంలో నేనేమి
తక్కువ కాదంటున్నాడు
చురుకుదనాన్ని / కనబరుస్తున్నాడు
కళ్లున్న మాసిన
మొహాల సోమరులకు
చురక పెడుతున్నాడు

## తగని అలంకారం

**స**భా సదులకు / అనుకూలంగా
ప్రసంగించనివాడు
కావు కావు మనే / కాకి గోలను
తలంపుకు తెస్తాడు
చెప్పును విసిరేసేలా
ఆగ్రహానికి / గురిచేస్తాడు

**-జి. శ్రీశైలం**

"సరే, నీ ఇష్టం. పెళ్లి ప్రయత్నాలు చేయమంటావా"

ఒక్క క్షణం ప్రభాత్ ఆమె మనస్సులో మెదిలాడు. "ఈ ఏడాది సివిల్స్ పూర్తయిందాకా ఆగు నాన్నా" అంది వినూత్న.

ప్రభాత్, వినూత్నా తరచూ ఫోన్లో మాట్లాడు కుంటూనే వున్నారు.

"నీ ఉద్యోగ ప్రయత్నాలు ఎందాకా వచ్చాయి" అడిగింది వినూత్న.

"డెఫినెట్‌గా వస్తుంది. ఎం.ఎల్.ఏ. ద్వారా గట్టి రికమండేషన్ తగిలించాను ఈసారి. నీ సంగతేంది" అడిగాడు ప్రభాత్.

"ఆఖరి ఛాన్సు, సివిల్స్‌కే ప్రయత్నిస్తున్నాను" అంది వినూత్న.

"నువ్వు చెపితే వినవు గదా. ఇప్పటికి రెండు ఛాన్సులు పొయ్యాయి. అది వొచ్చేదా చచ్చేదా. ఇంకా ఎందుకు దానిమీద వోజు. నువ్వు సివిల్స్‌లో సెలెక్టయినా, కాకున్నా, ఉద్యోగం చేసినా, చేయకున్నా మనకేం బాధలేదు. నా ప్రపోజల్ గుర్తుంది కదా. మీ ఇంట్లో చెప్పావా?" అన్నాడు ప్రభాత్.

"తొందరపడకు" అని ఫోన్ పెట్టేసింది వినూత్న.

ప్రభాత్‌కు లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. వెంటనే వినూత్నకు ఫోన్‌చేసి చెప్పాడు. 'కంగ్రాట్స్' అంది వినూత్న పొడిగా.

"నేను మెయిన్స్‌లో మంచి ర్యాంకులో వచ్చాను. వచ్చే వారమే ఇంటర్వ్యూ" అని చెప్పింది.

ఇంటర్వ్యూలో బాగా స్కోర్ చేసింది వినూత్న. ఫైనల్ ఫలితాల్లో మంచి ర్యాంకుతో ఎంపికయింది. రెండుసార్లు ఓడిపోయినా పట్టుదల పట్టి ప్రయత్నించినందుకు ఫలితం దక్కిందని సంతోషించింది. ట్రైనింగ్‌కు హాజరు కమ్మని ఆదేశాలు వచ్చాయి. తన విజయం సంగతి ప్రభాత్‌కు చెపుదామా, వద్దా అని కొంతసేపు వితర్కించు కొని, చెప్పడానికే నిశ్చయించుకొని ఫోన్ చేసింది.

"సాధించావే మొత్తానికి" అన్నాడు ప్రభాత్ కొంచెం ఆగి.

"రేపు నేను మీ వూరు వద్దామనుకొంటున్నాను" అన్నాడు.

"ఎందుకు?" అడిగింది వినూత్న.

"ఇంక మన పెళ్లి విషయం మీ నాన్నతో మాట్లాడాలి కదా"

"నా అంగీకారం అక్కర్లేదా?" అంది వినూత్న. కంగుతిన్నాడు ప్రభాత్.

"అంటే..." అని అడిగాడు.

"సారీ ప్రభాత్. మన ఇద్దరి మనస్తత్వాలూ కలవ్వు. మనం దంపతులుగా వుండలేమనుకుంటాను. ఫ్రెండ్స్ గానే వుండిపోదాం" అంది వినూత్న.

"ఇంత గొప్ప జ్ఞానోదయం నీకు ఎప్పుడయిందో తెలుసుకోవచ్చా" వెటకారంగానూ, నిష్ఠూరంగానూ, కోపంగానూ అడిగాడు ప్రభాత్.

"నువ్వు చిన్నబుచ్చుకోవల్సింది గాని, కోపగించుకో వల్సింది గానీ ఏమీ లేదనుకుంటాను ప్రభాత్. జీవితం యెడల మన ఇద్దరివీ వేరు వేరు దృష్టి కోణాలు. ఉద్యోగం సంపాదించుకోవడానికి ఎం.పీ.దో, మినిష్టరుదో రికమండేషన్ కావాలనుకుంటావు నీవు. సొంత శక్తిమీద ఆత్మవిశ్వాసం లేనివాడే అలా దొడ్డిదార్లు వెతుక్కుంటా డనుకుంటాను నేను"

"అది లోకంలో అందరూ చేసేదే" అడ్డం వచ్చాడు ప్రభాత్.

"అదే మన తేడా. అందరూ చేయొచ్చు. కానీ నేను చేయను. చేసేవాళ్లను అంగీకరించను. అదలా వుంచు. నువ్వు నా స్నేహితుడుగా నాకు ఉత్సాహం ఇవ్వాలని ఆశిస్తాను. నా ప్రయత్నాలకు తోడునీడగా వుండి నాకు ప్రోత్సాహం ఇవ్వాలని కోరుకుంటాను. నేను సివిల్ సర్వీస్ పరీక్షలకు కూర్చుంటానంటే నువ్వు మనస్ఫూర్తిగా ప్రోత్సహిస్తావనుకున్నాను. కానీ మొదట్నుంచీ నన్ను నిరుత్సాహపరుస్తూనే వచ్చావు. నా తొలి ప్రయత్నాల్లో ఓడిపోతే నువ్వు నా పక్కన నిలబడి 'ఈ ఓటమితో క్రుంగి పోవద్దు, రెట్టించిన ఉత్సాహంతో మళ్ళీ ప్రయత్నించు' అని ధైర్యం చెపుతావని ఆశించాను. కానీ 'అది నీ చేతగాదులే' అని పిరికిమందు పోస్తూనే వున్నావు. ప్రిలిమ్స్‌లో పాసై, మెయిన్స్‌లో పాసై తీవ్రంగా ప్రయత్నించినా ఎంపిక కాలేకపోయినపుడు నేనెంత క్రుంగిపోయానో నీకు తెలియదు. ఎన్ని రాత్రులు నిద్రలేకుండా ఏడ్చానో నీకు తెలియదు. నువ్వు పక్కనుండి నన్ను ఓదారుస్తావని ఎంతో ఆశించాను. కానీ నీ నుంచి ఓదార్పు కాదుగదా 'నీ చేత కాదులే' అనే మాటలే ఎదురయ్యాయి. నేను నా కెరీరు విషయంలో ఎంత పట్టుదలగా వున్నానో మొదటినుంచీ నీకు తెలుసు. అయినా, ఉద్యోగం లేకపోయినా ఫర్వాలేదు అని నా తరపున నీవే తీర్మానించావు. సారీ ప్రభాత్, మనం కలిసి భార్యా భర్తలుగా వుండలేం. మనం మంచి స్నేహితులం. అలాగే వుండిపోదాం" అంది వినూత్న.

దాదాపు ఐదు నిముషాల నిశ్శబ్దం గడిచింది వారిద్దరి మధ్యా.

"సారీ ప్రభాత్" అని ఫోను పెట్టేసింది వినూత్న. ■

## చెత్తకుండీ నవ్వింది

ఏ కాముకుని ప్రతిరూపమో
ఏ సరదాల జ్ఞాపక చిహ్నామో
కెవ్..మని అరచి కళ్ళు తెరిచాను
చెత్తకుండీలో నేను మెరిసాను
జీవమున్న సున్నపు ముద్దను నేను
ప్రతిఘటించలేను.. బదులివ్వలేను
ఆకలితో ఏడ్చాను?.. ఏం లాభం?
భౌభౌ అన్న కుక్కల అరుపుల ముందు
నా కేర్.. కేర్.. కెవ్.. కెవ్ అరుపులు ఏపాటివి?..
ఇప్పుడు నాకు కావలసినది నా కన్నీళ్ళు కాదు
మాతృమూర్తి స్తనాలలోని ముర్రిపాలు
నా కన్నీటి రోదనలకు కారకులెవ్వరు?
కామానికి గురైన నా తల్లా?
చీకటిలో ఆకలి అని.. ధర్మం
అడిగితే అత్యాచారం చేసిన ఆ కాముకుడిదా??
ఎవ్వరిది తప్పు?.. ఆగండి! ఆలోచించండని
చెత్తకుండీ నావైపు చూసి నవ్వింది

-ఈవేమన

## ఆశ్రయ చెర

ఇంకా ఎండని పచ్చితనం నువ్వు
సంగ్రహించిన శక్తిని / చీమల్లా దాచుకొని...
మనోవల్మీకంలో
మహాద్భుతమయ్యే వాక్యం నువ్వు
ఎక్కడ్డో ఓ మూలన / ఆకాశంపై వాలిన
రెక్కల నక్షత్రం వంటి నువ్వు...
అక్కడెక్కడో ఫత్వా పొగలను వూదిన
మౌఢ్య శకటం రక్తవాక్య తుంపర్లను
అక్షరబద్ధం చేసి... బద్ధశత్రువైన నువ్వు...
మత రహదారి విస్తరణలో
మూలనుండి మధ్యకొచ్చిన అక్షర దీప స్థంబంలా..
మిణుగురులంటిన రెక్కలను ఉగ్గబట్టి
ఇక్కడి చీకట్లను చివర్లకీడుస్తున్న
వెలుతురు సీతాకోక చిలుక నువ్వు...
అక్షరావాహన గాలిపటాలకి
రోద్దుని తోకలా కట్టి ఎగరేసిన
వెలుగు సంక్రాంతి నువ్వు / అమ్మా... తస్లీమా...
ఈ దేశ తటాకంలో భద్రతా చంద్రుడి ఆనవాలు చూసి
మా భూమికి అతిథిగా వచ్చిన ఆకాశానివి నువ్వు..
ఈ దేశ తీరంలో
ఆతిథ్య రేణువులు అక్షరాల్లా పేర్చి రాసిన
సైకత పుస్తకానివి నువ్వు...
ఎన్ని మత, రాజకీయ కెరటాలు ముంచెత్తినా
మాయం చేయలేని / మా ఆత్మ పుస్తకానివి నువ్వు

❖ ❖ ❖

నరహంతకుల చేతులకు గులాబీ ముళ్ళు గుచ్చి
ఆ రక్తం ప్రజలది కాదు...
ప్రజల కోసం చిందించినదని
తాజా రాగాలు పలుకుతున్న రాజకీయ రోజులివి.
గాడ్సేలకు విగ్రహాలు పెడుతూ
తల్లినే వివస్త్రను చేసిన తనయులు/రాణిస్తున్న రోజులివి

❖ ❖ ❖

నువ్వు నీ దేశంలో భుజానికెత్తుకున్న జాతి
ఇక్కడ బుజ్జగింపు ధోరణుల
బలహీన క్షణంలో ఉందనే కదా...
'ద్విఖండిత'నుండి కొన్ని పేరాల తలలను
నువ్వే ఖండించావు.
విభజన రేఖ కేవలం విభజన మాత్రమే చేస్తుంది
కానీ సరిహద్దు ప్రాంతం... అలా కాదు కదా!
ఇరు ప్రజల సాంప్రదాయాల
ఇరు ప్రజల సంస్కృతుల
ఇరు ప్రజల భాషల మేలుకలయిక కదా!
ఈ సంగమాన్ని ఏ రాజకీయ హింసలూ
హంసలా విభజించలేవు. / ఏ అంతులేని వ్యథలూ
నీ భావాల పోరాటాన్ని రాజీపర్చలేవు.
నీ దేశంలో... మా ప్రజల బాధల్ని
నువ్వు అక్షరబద్ధం చేసావు.
మా దేశంలో... నీ స్వేచ్ఛా భావాల్ని
మేము రక్తసంబంధం చేస్తున్నాము
నువ్వు పూర్తిచేయాల్సిన కొత్త రచనకు
సిరా మేమే అవుతాము.

-కె. ఆంజనేయకుమార్